తియ్యటి బహుమతి
పొందిన మరో
కథ



# బీచ్ లో సాయంత్రం

ఆదివా త్రైరు యూనివర్సిటీలో చేరిన తొలిరోజు. ఎప్పటినుండో కోరిక ఉండి సాయంత్రం దగ్గరలోనే ఉన్న బీచ్‌కు వెళ్ళాను.

మనసంతా హాయిగా ఉండి ఓ చోట ఇసుకపై కూర్చున్నాను.

కెరటాల ఆటల్ని చూస్తుంటే వయసులో ఉన్న మనసులో ఏదో మూల గోలగా వుంది.

ఆమె దివినుండి అప్పుడేసముద్రతీరంలో రాలిన పారిజాత పుష్పంలా వుందనిపించి దా క్షణంలో.

ఆమె నవ్వింది. పలకరింపుగా నవ్వినట్లుందామె.

ఆ నవ్వుకు అర్థం తెలియక తెల్లబోయి చూసాను.

మళ్ళీ మెల్లగా నవ్వింది. అందంగా నవ్వింది. అదోలా నవ్వింది. హాయిగా నవ్వింది.

ఎవ్వరూ చూడకుండా నేనూ నవ్వాను. ఉరకలు వేస్తున్న ఆనందాన్ని అణచుకుంటూ.

సిగ్గుతో ఆమె తల వాలిపోయింది.

ఆమె చిరునవ్వు నవ్వింది. చిన్నగా నవ్వింది. చిత్రంగా చిలిపిగా నవ్వింది. సన్నని గులాబీ రేకులవంటి ఆమె పెదవులు తెరిస్తే కనిపించే ముత్యాల కోవలాంటి అందమైన పలువరస ఒక్కసారిగా తళుక్కుమంది.

అందాలరాశి ముందు కూర్చుని ఆమె నవ్వుతో పాలు పంచుకున్నందుకు గర్వంగా కాలర్ సవరించుకుంటూ మరీ నవ్వాను.

తనలో తాను నవ్వుకుందామె

వెన్నెలలాటి ఆ చిరునవ్వుతో శారీరక స్వాంతనకాక మానసికంగా ఏదో చల్లదనం లభించినట్లయింది నాకు.

ఒక్కసారిగా నవ్వింది. కిసుక్కున నవ్వింది తమాషాగా నవ్వింది. గమ్మత్తుగా నవ్వింది.

మళ్ళీ నవ్వితే ఆ నవ్వు మూలంగా బుగ్గల్లో ఏర్పడ్డ సొట్ట చూడాలని కోరికగా వుంది.

ఈసారి ఆమె కిలకిలా నవ్వింది. గలగలా నవ్వింది. ఫకాల్న నవ్వింది. పకపకా నవ్వింది. పడీపడీ నవ్వింది.

నాకు గట్టిగా నవ్వొచ్చింది. నాలో సంతోషం పరవళ్ళు త్రొక్కుస్తుంది.

మళ్ళీ నవ్వింది. మువ్వలు జల్లినట్లు నవ్వింది. పువ్వల్లే నవ్వింది. నిండుగా నవ్వింది.

ఆమె నవ్వినపుడు కుడిచివర బయటికి తొంగిచూసే సన్నని పంటినొక్కు నాకు చాలా యిష్టం.

నావైపే చూస్తుంది ఆమె నవ్వుతూ. నా హృదయం ఆనందంతో తేలిపోతోంది. ఆ అనుభూతిని గుండెలో పదిలంగా దాచుకున్నాను.

ఆమె పొట్ట పట్టుకుని నవ్వసాగింది. విరగబడి నవ్వింది పగలబడి నవ్వింది గుక్క తిప్పుకోకుండా నవ్వుతోంది. మరోసారి పెద్దగా నవ్వింది. నవ్వి నవ్వి అలసిపోయింది

ఇద్దరం అలా మృదుమధురంగా మనసారా నవ్వుకుంటున్నాము.

అంతలో చుట్టూ కలవరం.

నా నవ్వుల పువ్వుని ఎవరో బలవంతాన తీసుకుపోతున్నారు. ఆమెతోపాటు నన్ను కూడా వింతగా చూస్తున్నారు జనం.

చెవులను తాకిన మాటలు "ఆమె దగ్గరలోనే ఉన్న మెంటల్ హాస్పటల్ నుంచి తప్పించుకుని వచ్చింది. హాస్పటల్ సిబ్బంది వచ్చి పట్టుకుపోతున్నారు."

అప్పుడు అనిపించింది నాకు.

నేను కూడా ఓసారి వెళ్ళి టెస్ట్ చేయించుకుంటే మంచిదని ● ● ●



— బొమ్మారెడ్డి మురళీధర్